క్లుప్తంగా

గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు

మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్ చంద్రన్న ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. మండలంలోని మద్దూరులో న్యూట్రిషన్ డే సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. పుష్పలత, ఆశలు హేమలత, పావని, అంగన్‌వాడీ టీచర్స్, వెలుగు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

శాంతినగర్ : తనగల ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరారు. శనివారం వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల పాఠశాలలో పేరెంట్స్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. పాఠశాల భవనం పక్కనే మూత్ర విసర్జన చేయడం, బహిరంగ మలవిసర్జనతో పాఠశాల ఆవరణ కంపుకొడుతోందని, తరగతి గదుల్లో విద్యార్థులు చదవలేక పోతున్నారని వాపోయారు. ఈ విషయమై ఉన్నతధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేలా చూడాలని వారు కోరారు.

స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయండి



గద్వాల అర్బన్: పీడీఎస్‌యూ 50వసంతాల స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే పీడీఎస్‌యూ వసంతాల స్వర్ణోత్సవాలను విద్యార్థులు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. నాయకులు చందు, రాముడు, మురళి, శివ, చరణ్, నాగరాజు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



శాంతినగర్: గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు జమ్మిచేడ్ కార్తీక్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు.. 8 నెలలుగా పంచాయతీ వర్కర్లకు వేతనాలు రావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు మంజూరుచేయాలని, లేని పక్షంలో సిబ్బందితో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. తిమ్మప్ప, శ్రీనివాసులు, మద్దిలేటి, మారెప్ప, దేవన్న, శంకర్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ



అయిజ: అండర్ స్కూల్ గేమ్స్ 68వ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో టోర్నమెంట్‌లో మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లాలోని ఎర్రవల్లి సరస్వతి స్కూల్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఖోఖో అండర్ 14, 17 అండర్ విభాగాల్లో మండల విద్యార్థులు మెదటి బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ మేరకు.. పలువురు ప్రముఖులు విద్యార్థులను అభినందించారు.

'చలో హైదరాబాద్' పోస్టర్ల విడుదల

గట్టు: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల మెస్‌చార్జీలను పెంచాలని కోరుతూ ఈ నెల 23న చేపట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని కేవీపీఎస్ నాయకులు కోరారు. శనివారం మండలంలోని చలో హైదరాబాద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు విడుదల చేశారు. హాస్టల్ విద్యార్థుల కాస్మోటిక్ చార్జీల పెంపు, సొంతభవనాల ఏర్పాటు, మెను సక్రమంగా అమలు చేయాలంటూ చలో సంక్షేమ భవన్‌ను చేపట్టినట్లు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెన్న తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కర్రెప్ప, నాయకులు పాల్గొన్నారు.

బడిలోనే బంగారు భవిష్యత్

గట్టు: బడిలోనే చిన్నారుల బంగారు భవిష్యత్‌కు పునాదులు పడతాయని, తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పని సరిగా బడిలోనే ఉండే విధంగా సహకరించాలని నీతి ఆయోగ్ జిల్లా కో–ఆర్డినేటర్ అఫ్జల్, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి డాక్టర్ ప్రియాంక కోరారు. శనివారం ఆలూరు పరిధిలో బడి మానేసి, పత్తి పొలాల్లో పనులు చేసుకుంటున్న విద్యార్థులను గుర్తించి, పొలాల వద్దకు చేరుకుని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బడిమానేసిన విద్యార్థులను గుర్తించి అవగాహన కల్పించారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. 14 ఏళ్లలోపు బాలబాలికలను తప్పనిసరిగా బడికి పంపాలని కోరారు. చదువుకుంటే భవిష్యత్‌లో కలిగే ప్రయోజనాల గురించి తల్లిదండ్రులకు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరితారాణి, ఎంపీడీఓ చెన్నయ్య, ఎంఈఓ నర్సింహులు, జీహెచ్‌ఎం నాగరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి తదితరులు పాల్గొన్నారు.



ఆలురులో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

మల్దకల్: పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జీహెచ్‌ఎం నరేష్ తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు పాఠశాలలకు సక్రమంగా పంపించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా బడిలో ఉండే విధంగా చూడాలని ఎంఈఓ శివప్రసాద్ సూచించారు. శనివారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తున్నామని, ప్రతి ఒక్క తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రుల సహకరించి విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: బడీడు పిల్లలందరూ బడిలో ఉండాలని వారితో పనులు చేయిస్తే చట్టరీత్య చర్యలు తప్పవని జిల్లా సమన్వయ అధికారి హంపయ్య, ఎంఈఓ సురేష్ అన్నారు. శనివారం మండలం కేంద్రంలోని, కొండాపురం తదితర గ్రామాల్లో పనులు చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి.. వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను బడికి పంపే విధంగా ఒప్పించి బడీడు పిల్లలను బడిలో చేర్పించారు. పిల్లలను చదివించి మంచి భవిష్యత్ ఇవ్వాలని సూచించారు. మండల నోడల్ అధికారి వెంకటేశ్వర్‌రావు, హెచ్‌ఎంలు మురళీధర్, ఉపాధ్యాయులు సురేందర్, గోపాల్, కిరణ్, రఘు ఉన్నారు.



కేటీదొడ్డిలో అవగాహన కల్పిస్తున్న సమన్వయ అధికారి హంపయ్య



మల్దకల్‌లో మాట్లాడుతున్న జీహెచ్‌ఎం నరేష్

పండ్లతోటల సాగుతోనే అధిక లాభాలు



విఠలాపురంలో పండ్లతోటలను పరిశీలిస్తున్న అధికారులు

మల్దకల్: పండ్ల తోటల సాగుతోనే రైతులు అధిక లాభాలు పొందవచ్చునని డీఆర్‌డీఓ నర్సింగరావు రైతులకు సూచించారు. శనివారం మండలంలోని విఠలాపురంలో రైతు సాగుచేసిన జామ, మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పండ్లతోటల సాగుపై రైతులకు సబ్సిడీ అందిస్తుందని, దానిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. తక్కువ ఖర్చులతో ఎక్కువ లాభాలు పొందే పంటలను రైతులు సాగు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ముఖ్యంగా రైతులు అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పండ్ల తోటలు కొంత దెబ్బతిన్నాయని రైతులు డీఆర్‌డీఓ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఈసీ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ ప్రమీల, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

సైంటిస్ట్‌కు సన్మానం



అయిజ: అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న మండలంలోని ఉప్పల గ్రామానికి చెందిన గంటపోగు చంద్రశేఖర్‌ను బీఆర్‌ఎస్ నాయకులు సంకాపురం రాముడు శనివారం తన కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడారు.. మారుమూల గ్రామంలో పేద కుటుంబంలో పుట్టిన చంద్రశేఖర్ అమెరికాలో సైంటిస్ట్‌గా పనిచేస్తుండడం హర్షించదగ్గ విషయమని అభినందించారు. యువత ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, తల్లిదండ్రులకు, దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

అయిజ: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రాములు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా కొత్తబస్టాండ్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను పలువురు ప్రముఖులు కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల, పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

తహసీల్దార్‌కు వినతి



అయిజ: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం నిబంధనలు పాటించకుండా స్కూల్ బస్సులను నడుపుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. అనంతరం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ కార్యదర్శి భగత్ రెడ్డి మాట్లాడారు.. వాహనాలు ఫిట్‌నెస్ బాగుండేలా చూడాలని, డ్రైవర్లకు సరైన అవగాహన కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రదీప్ కుమార్, భగత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న గ్రామస్తులు

ఎర్రవల్లి: మండల కేంద్రంలో ప్రైవేట్ కరెంట్ హెల్పర్‌గా పనిచేస్తున్న రానా ప్రతాప్ ఇటీవలే విద్యుదాఘాతంతో మృతి చెందారు. దీంతో మృతుడి కుటుంబానికి భరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో గ్రామస్తులంతా ఏకమై తమకు తోచినంత చందాను వసూలు చేసి రూ. లక్షా 50వేల నగదును శనివారం బాధిత కుటుంబసభ్యులకు అందించి కుమారుడి పేరిట బ్యాంక్‌లో ఫిక్స్ డిపాజిట్ చేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు లోకారెడ్డి, రాగన్న, మల్లేష్‌రెడ్డి, పరిపూర్ణాచారి, దర్మారెడ్డి, రాజు, పెద్దలక్ష్మన్న, నర్సింహారెడ్డి, ప్రసాద్‌గౌడ్, కృష్ణ, తదితరులు ఉన్నారు.



నగదును అందిస్తున్న గ్రామస్తులు

బీజేపీ సభ్యత్వ నమోదు



విఠలాపురంలో సభ్యత్వం చేయిస్తున్న నాయకులు



బోయలగూడెంలో

మల్దకల్/కేటీదొడ్డి/గట్టు: మండలంలోని విఠలాపురం, మల్లెందొడ్డి, ఎల్కూరు గ్రామాల్లో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు పాల్వాయి రాముడు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో ప్రజలు సద్వినియోగం చేసుకుని మరింత అభివృద్ధి చెందాలన్నారు. అదేవిధంగా మండలంలోని వెంకటాపురంలో బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు.. అలాగే గట్టు మండలం బోయలగూడెంలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. వికసిత్ భారత్ అభివృద్ధిలో సభ్యత్వ నమోదును చేపట్టినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఆయా కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గోకారి, గజ్జెలన్న, సర్వేష్‌గౌడ్, ఉమాకాంత్ నాయుడు, కేటిదొడ్డి మండల అధ్యక్షుడు నాగప్ప, కన్వీనర్ బల్గెర నల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు కిట్టుస్వామి, ఓబీసీ మండల అధ్యక్షుడు మొద్దు సంజీవ, రాఘవేంద్ర, కృష్ణ, చంద్రశేఖర్, గట్టు మండల అధ్యక్షుడు హన్మిరెడ్డి, శ్రీపాదరెడ్డి, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

నాటిక ప్రదర్శన

అలంపూర్ రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో నాటిక ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వీర తెలంగాణ నాటిక ప్రదర్శన శౌర్య యాత్ర చేపట్టారు. కళాకారులు నాటిక ప్రదర్శనతో పాటు వివిధ తెలంగాణ సాయుధ పోరాట పటిమ గల పాటలను పడుతూ, ఆటలను ఆడారు. వారు చేసిన కార్యక్రమం ప్రజలను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్, నర్సింహ, ఉపాధ్యక్షుడు వెంకన్న, నాయకులు చంద్రమౌళి, శివ, జక్కన్న అలీ అక్బర్, ఆశన్న జిల్లా వ్యవసాయ కార్మికసంఘం కార్యదర్శి రాజు, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జీకే ఈదన్న రాష్ట్ర కళకారులు, సీపీయం నాయకులు పాల్గొన్నారు.



ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



గద్వాలలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని కేక్ తినిపిస్తున్న నాయకులు

గద్వాల: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని పార్టీ నాయకులు, అభిమానులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్థానిక అంధుల పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు అందజేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంప్‌పప్ కార్యాలయంలో ఆయనకు పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యాకర్తలు పాల్గొన్నారు.

కేటీదొడ్డి/ధరూరు/గట్టు: : ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కుచినెర్లలో కాంగ్రెస్ నాయకులు నర్సింహులు శెట్టి ఆధ్వర్యంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అదేవిధంగావెంకటాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని మండల కాంగ్రెస్ నాయకులు 101కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ధరూరులోని కస్తుర్బాగాంధీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు వాటర్ గ్రీజర్‌తోపాటు ఇన్వర్టర్లను మండల కాంగ్రెస్ నాయకులు, బీకేఎంఆర్ సైన్యం ఏర్పాటుచేసిన వాటిని ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. గట్టులోని శనివారం కాంగ్రెస్ నాయకులు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లోని సుమారు150 మంది చిన్నారులకు పలకలు, పండ్లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమంలోమాజీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వరరెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, డీఆర్ విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, కేజీబీవీ ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్‌నాయుడు, పట్టయ్య, శెట్టి కర్రెప్ప, సిద్ధయ్య, కృష్ణ, మునిస్వామి, ఆంజనేయులు, గట్టు మార్కెట్ కమిటీ డైరెక్టర్ బజారి, నాయకులు గాజుల సంతోష్, రాజుగౌడ, తిమ్మప్ప పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఆయన శనివారం లబ్ధిదారులకు అందించారు. నియోజకవర్గంలోని రాజోలి మండలం ముండ్లదిన్నె గ్రామానికి చెందిన శిరీష ఆపరేషన్ కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 1.50లక్షల ఎల్‌ఓసీ వచ్చినట్లు తెలిపారు. ఎల్‌ఓసీని ఎమ్మెల్యే కుటుంబ సభులకు అందించారు. బీఆర్‌ఎస్ నాయకులు శేషిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘు రెడ్డి, వెంకటనారయణ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి తదితరులు ఉన్నారు.



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్‌లో సమస్యలు పరిష్కరించాలి

అలంపూర్ రూరల్: పట్టణంలోని వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆసీఫ్ ఖాన్ అధికారులను కోరారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ సరస్వతిని, మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమను శనివారం కలిసి పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని వార్డులలో వీధి దీపాలు వెలగడం లేదని, మిషన్ భగీరథ నీళ్ల రావడంలేదని రోడ్ల మరమ్మతులు చేపట్టాలని వారిని కోరారు. నాయకులు రఘుపతినాయుడు, మాన్సూర్, జాకీర్, బాబు, ఫరూఖ్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆసీఫ్ ఖాన్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేస్తున్న మార్కెట్ చైర్మన్ దొడ్డెన్న



ఎర్రవల్లిలో..

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం మహాలక్ష్మి పథకంలో భాగంగా సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు అందజేస్తుందని.. మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న అన్నారు. శనివారం మండలంలోని ఉప్పల, ఉప్పల క్యాంపు గ్రామాల్లో లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ ప్రొసిడింగ్‌లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం పేద ప్రజల ఇళ్లల్లో వెలుగులు నింపుతుందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు భాస్కర్ గౌడ్, లక్ష్మన్న, తిమ్మోతి, తిమ్మారెడ్డి, లాల్ గౌడు, కర్రెన్న, కిరణ్, ఆయా గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: ఉమ్మడి ఇటిక్యాల మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు శనివారం లబ్ధిదారులకు రూ.500 సబ్సిడీ గ్యాస్ ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. నాయకులు నర్సింహ, యువరాజ్, అల్లబకాష్, రాముడు, మల్లికార్జునగౌడ్, ఖాజా, ఆయా గ్రామాల కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

కేటీదొడ్డి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ఇర్కిచేడుతండా శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఇర్కిచేడు తండాకు చెందిన శంకర్ నాయక్ (30) బైక్‌పై పాతపాలెం గ్రామానికి వెళ్లి వస్తుండగా.. తండా సమీపంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. మృతుడి సోదరుడు మున్యా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఆలూరులో అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ వాసంతి



శాంతినగర్‌లో..

గట్టు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ వాసంతి కోరారు. పోషణ మాసంలో భాగంగా శనివారం ఆలూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై అవగామన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు ఆకు కూరలు, కూరగాయలు ప్రతి రోజు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రంలో ఒక పూట భోజనాన్ని అందిస్తున్నారని, సెంటర్‌లోనే స్వీకరించాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, చంద్రకళ, ఇంద్ర, కళావతి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం వెంకటనర్సమ్మ, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సునిత, శ్రీదేవి పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, కలుకుంట్ల తదితర గ్రామాల్లో శనివారం సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని గర్భిణులకు, బాలింతలకు. చిన్నారులకు తప్పకుండా పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.